



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

పగ.. ప్రతీకారాలే!


- జిల్లాలో పెరుగుతున్న హత్యా రాజకీయాలు
- ఏడాదిన్నర కిందట గార మండల ఉపాధ్యక్షుడి హత్య
- ఇటీవల ఎచ్చెర్ల ఉపాధ్యక్షురాలి భర్తపై హత్యాయత్నం
- రాజకీయ ఆధిపత్యంలో భాగంగానే..
- వివాదాలను పట్టించుకోని పార్టీ పెద్దలు

● 2022 డిసెంబరు 6న గార మండల ఉపాధ్యక్షుడు బరాటం రామశేషు దారుణంగా హత్యకు గురయ్యారు. ఉదయం తన రైస్‌మిల్లు వద్దకు వెళ్లి వస్తుండగా వేట కొడవళ్లతో ముగ్గురు వ్యక్తులు దాడిచేశారు. దీంతో ఘటనాస్థలంలోనే రామశేషు కుప్పకూలిపోయాడు. తమ ఎదుగుదలకు రాజకీయంగా, ఆర్థికంగా అడ్డు తగులుతున్నాడని గారకు చెందిన ఇద్దరు వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని విచారణలో తేలింది.



దాడిలో గాయపడిన శంకరరావు (ఫైల్)

● గత నెల 9న ఎచ్చెర్ల వైస్ ఎంపీపీ జరుగుళ్ల విజయకుమారి భర్త శంకరరావుపై హత్యాయత్నం జరిగింది. పొలం నుంచి వస్తున్న శంకరరావుపై ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడిచేశారు. దీంతో శంకరరావు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరారు. ఇంకా చికిత్స పొందుతూనే ఉన్నారు. ఈ ఘటనకు రాజకీయాలే కారణం. తన ఎదుగుదలకు అడ్డు తగులుతుండడంతో ఎంపీపీ మొదలవలస చిరంజీవి.. శంకరరావు హత్యకు నిందితులకు సుపారీ ఇచ్చినట్టు పోలీసులు ధ్రువీకరిస్తూ ఆయన్ను ఇటీవల అరెస్టు చేశారు.



(రణస్థలం)

ప్రశాంత సిక్కోలులో గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదు. అయితే ఈ రెండు ఘటనల్లో బాధితులు, నిందితులు రెండు వర్గాలు కూడా అధికార పార్టీ వారే. కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమే ఈ ఘటనలు జరిగినట్టు తెలుస్తోంది. ఇలా విభేదాలు తలెత్తిన నాయకులను ఒకచోట కూర్చోబెట్టి మాట్లాడాల్సిన కీలక నాయకులు తమ పని కాదన్నట్టు వ్యవహరించారు. దీంతో వారి మధ్య వివాదాలను మరింత ముదిరి.. దాడులు, హత్యల వరకూ దారి తీశాయి. గత ఎన్నికల్లో జగన్‌ను సీఎం చేసేందుకు ప్రతి నాయకుడు సైనికుల్లా పనిచేశారు. తమకు రాజకీయంగా పదవులతో పాటు ఆర్థికంగా కొంతవరకూ కోలుకోవచ్చని భావించారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. తాము ఆశల పల్లకిలో ఉండడం, తమ అవకాశాలను మరొకరు కొట్టుకుపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య పెద్ద అగాధమే ఏర్పడింది. తాము కోరుకున్న పదవి తమకు దక్కకపోగా.. ఏ సంబంధం లేని వ్యక్తి తన్నుకు పోవడాన్ని వారు సహించలేక పోయారు. ఎచ్చెర్ల లో జరుగుళ్ల శంకరరావుపై జరిగిన దాడి వెనుక ఇదే కథ నడిచింది. వైసీపీ ఆవిర్భావం నుంచి శంకరరావు క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ అభివృద్ధికి కృషిచేశారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ ఓడిపోయా రు. దీంతో కిరణ్‌కుమార్ గెలుపునకు 2014-19 మధ్య శంకరరావు గట్టిగానే కృషిచేశారు. మండల వైసీపీ కన్వీనర్‌గా వ్యవహరిస్తూ మండల వ్యాప్తంగా బాగానే పనిచేశారు. పార్టీ అధికారంలోకి వస్తే తాను ఎంపీపీ అవుతానని భావించారు. కానీ గత ఎన్నికల ముందు మొదలవలస చిరంజీవి.. పార్టీలో చేరి ఎంపీపీ పదవి చేజిక్కించుకున్నారు. శంకరరావు పార్టీ పెద్దల వద్ద వాపోవడంతో ఎంపీపీ పదవీ కాలాన్ని చెరిసగం పంచుకోవాలని సూచించా రు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య వివాదం ముదురుతూ వస్తోంది. కానీ పార్టీ పెద్దలు కలుగజేసుకున్న దాఖలాలు లేవు. మరోవైపు ఒప్పందం ప్రకారం చిరంజీవి పదవి కాలం ముగిసినా.. శంకరరావుకు బాధ్య తలు అప్పగించేందుకు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శంకరరావుపై హత్యాయత్నం జరిగింది.

● ఏడాదిన్నర కిందట బరాటం రామశేషు హత్యకు కూడా ఇదే కారణం. ఆయన గార మండల ఉపాధ్యక్షుడు కాగా.. ఆయన కుటుంబసభ్యులే శ్రీకూర్మం మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. గారకు చెందిన తండ్రీ కొడుకులు చేపల చెరువులు, ఇతరత్రా వ్యాపారాలు నిర్వహి స్తుండేవారు. అధికార పార్టీ సానుభూతిపరులుగా వ్యవహరించే వారు. అయితే తమ కార్యకలాపాలు, వ్యాపారాల్లో రామశేషు ప్రమే యం పెరగడంతో మరో ఇద్దరికి సుపారి ఇచ్చి మరీ రామశేషును హత్య చేయించారు.

● పట్టించుకోని కీలక నాయకులు..

పార్టీ పెద్దల ప్రమేయంతో వివాదాలు కొలిక్కి వచ్చే అవకాశముంది. కానీ కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్టుండేది పార్టీ పెద్దలు, ప్రజాప్రతినిధుల పరిస్థితి. దీంతో ఇద్దరిలో ఒక వర్గానికి కొమ్ముకాయడంతో మరో వర్గం తీవ్ర అసంతృప్తితో ఉండేది. అందుకే హత్యలు, హత్యాయత్నాలు వరకూ పరిస్థితి వచ్చినట్టు పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టిన చందంగా ఘటనలు జరిగిన తరువాత రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని చెప్పి అనుమానితులపై పార్టీ వేటు వేస్తున్నారు. కానీ ముందే మేల్కొని ఉంటే తప్పు జరిగి ఉండేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఓటర్ల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మార్చి 4: కొత్తగా ఓటు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ ఎం.నవీన్‌తో కలిసి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్, ఎన్నికలు, ఆరోగ్యశ్రీ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, వేసవి నీటి ఎద్దడికి పరిష్కార మార్గాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 30 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న మార్పులు, చేర్పులు సవరణల కోసం వచ్చిన 4,334 ఓటర్ల దరఖాస్తుల పరిశీలన తక్షణమే పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనలో నిర్లక్ష్యం పనికిరాదని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌లో సాంకేతిక సమస్యలు లేవని, మూడురోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 5,71,691 ఆరోగ్యశ్రీ కార్డులు రాగా 95శాతం కార్డుల పంపిణీ జరిగిందని, మిగిలినవి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేయాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇప్పటికే రూ.38కోట్లు ఖర్చు చేశారని, ఇంకా రూ.23కోట్లు రానున్న పది రోజుల్లో వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి

జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేశామని, దీనిపై అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సూచించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సహాయక పోలింగ్ కేంద్రాలు, స్థానాల మార్పులు, కొత్తపేర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు, నేతలతో కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లావ్యాప్తంగా 2,357 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పాతపట్నంలో అదనంగా ఒక సహాయ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఆమదాలవలస నియోజకవర్గంలో రెండు పాత కేంద్రాలను కొత్త చోటుకు మార్పు చేశాం. ఇవి మినహా జిల్లాలో ఎటువంటి మార్పులు లేవ'ని స్పష్టం చేశారు. 'పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలలు, అప్‌గ్రేడ్ కారణంగా జిల్లాలో 115 కేంద్రాల పేర్లు మాత్రమే మార్చాం. వాటి స్థానాలను మాత్రం మార్చలేదు. అత్యధికంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 42 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చాం. నరసన్నపేటలో 25, ఆమదాలవలసలో 22, పాతపట్నంలో 11, టెక్కలిలో 8, ఎచ్చెర్లలో 7 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చామ'ని కలెక్టర్ తెలిపారు. సమావేశాల్లో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, డీసీవో నగేష్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశరావు, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథరావు, ఆర్డీవో హెచ్.రంగయ్య, రాజకీయపార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు, కింరాపు ప్రసాద్(టీడీపీ), రౌతు శంకరరావు (వైసీపీ), మాధవరావు, మల్లిబాబు(కాంగ్రెస్) బి. ఉమామహేశ్వరరావు(బీజేపీ), డి.గోవింద రావు(సీపీఎం) పాల్గొన్నారు.

వాసుదేవుడి తెప్పోత్సవం



గోపాలసాగరంలో తెప్పోత్సవం



పొన్నచెట్టు వాహనంపై వాసుదేవుడి తిరువీధి..

మందస, మార్చి 4: మందసలో వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పొన్నచెట్టు వాహన సేవను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా ప్రాతఃకాలార్చన, నివేదన, తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవుని ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలు, పూలతో విశేషంగా అలంకరించారు. పొన్నచెట్టు వాహనంపై వేంచేపు చేసి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ తిరువీధి నిర్వహించారు. సాయంత్రం గోపాల సాగరంలో తెప్పోత్సవాన్ని కన్నులపండువగా చేపట్టారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి తీర్థగోష్ఠి నిర్వహించారు. వాసుదేవుడు అందరివాడని, ఆయనను నిత్యం కొలిస్తే శుభం జరుగుతుందని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి తెలిపారు. అలాగే వాసుదేవ పెరుమాళ్‌ను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ప్రధాన అర్చకులు కూర్మానందస్వామి శేషవస్త్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, డొంకూరు తిరుపతిరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకుడు డోకి రామారావు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలివే..

మంగళవారం ఉదయం మందస ప్రధాన వీధుల్లో రథోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం చక్రస్నానం, పుష్పయాగం, ధ్వజావరోహణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రొయ్యల చెరువులకు అక్రమంగా విద్యుత్

● విజిలెన్స్ అధికారుల కేసు నమోదు

సంతబొమ్మాళి, మార్చి 4: కొల్లిపాడు సమీపంలో రొయ్యల చెరువులకు అక్రమంగా విద్యుత్ వాడకంపై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. మండల విద్యుత్ శాఖ ఏఈ శివకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొల్లిపాడు సమీపాన 60 ఎకరాల్లో సాగవుతున్న రొయ్యల చెరువులకు నాలుగు విద్యుత్ మీటర్లు ఉన్నాయి. కొన్నేళ్లుగా లీజుకు తీసుకున్న జీరు వెంకటరెడ్డి రొయ్యల చెరువులకు విద్యుత్ అక్రమంగా వాడుతున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో విజిలెన్స్ అధికారులు, మండల విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. 93, 94 నెంబర్ల విద్యుత్ మీటర్లకు కనెక్షన్లు తప్పించి.. హైటెన్షన్ లైన్ నుంచి విద్యుత్ వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారని ఏఈ శివకుమార్ తెలిపారు. భారీగా అపరాధ రుసుం విధించనున్నట్టు వెల్లడించారు. దాడుల్లో విజిలెన్స్ శాఖ డీఈ చంద్రమౌళి, సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై నిర్లక్ష్యం

- నిరుపయోగంగా వాణిజ్య దుకాణ సముదాయం
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- ఇచ్ఛాపురం పురపాలక ఖజానాకు గండి



ఇచ్ఛాపురం పాతబస్టాండ్ జంక్షన్‌లో పెచ్చులూడుతున్న వాణిజ్య సముదాయాలు



ఇచ్ఛాపురంలో ఖాళీగా ఉన్న మునిసిపల్ దుకాణాలు

(ఇచ్ఛాపురం)

పురపాలక సంఘాలకు వాణిజ్య దుకాణాలే ప్రధాన ఆదాయ వనరులు. కాగా వాటి నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా పురపాలక సంఘాల ఖజానాకి గండిపడుతోంది. ఇచ్ఛాపురంలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన వాణిజ్య దుకాణాల సముదాయాలు పాడై.. శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని దుకాణాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండడంతో మునిసిపాలిటీ ఆదాయం కోల్పోతోంది. ఇచ్ఛాపురం పురపాలక సంఘానికి సుమారు 186 వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. మునిసిపల్ కార్యాలయం ముందు, పాత పెట్రోల్‌బంక్ ఎదురుగా, పాత బస్టాండ్ జంక్షన్, యూ కాంప్లెక్స్, సూపర్‌బజార్ తదితర ప్రాంతాల్లో దుకాణాలు ఉన్నాయి. 162 దుకాణాలు లీజుకు ఇచ్చారు. వీటి ద్వారా పురపాలక సంఘానికి ఏటా రూ.68,12,028 ఆదాయం వస్తుంది. ఐదేళ్లుగా 24 వాణిజ్య దుకాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి పలుమార్లు వేలం నిర్వహించినా అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. కొన్ని గదులు పెచ్చులూడిపోయాయి. వీటి మరమ్మతుల కోసం ఇంజనీరింగ్ విభాగం అధికారులు అంచనాలు తయారుచేసి టెండర్లు పిలిచారు. కానీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ల ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో వాణిజ్య దుకాణాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి.

● పాత బస్టాండ్ జంక్షన్‌లోని వాణిజ్య సముదాయం పైభాగంలో నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరాయి. ఎక్కడికక్కడ పెచ్చులూడుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే గదుల్లో నీరు చేరుతోంది. ఇలాంటి గదులు వేలంలో తీసుకున్నా.. మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అందుకే ఆ గదులు వేలంలో తీసుకోవడానికి ముందుకు రావడం లేదు.

● మునిసిపల్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న వాణిజ్య సముదాయాల దుస్థితి కూడా ఇలానే ఉంది. దీంతో ఏళ్ల తరబడి దుకాణాలు నిరుపయోగంగానే ఉన్నాయి.

ఆదాయం ఇలా..

● డైలీమార్కెట్‌లో 43 దుకాణాలకుగానూ 41 లీజుకు ఇచ్చారు. వాటి ద్వారా ఏటా పురపాలిక సంఘానికి రూ.18,57,072 ఆదాయం వస్తోంది. అలాగే డైలీమార్కెట్‌లోని నాలుగు వేకెంట్ ల్యాండ్స్ నుంచి రూ.2,19,552 ఆదాయం సమకూరుతోంది.

● పాత బస్టాండ్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో 28 దుకాణాల నుంచి రూ.10,71,552 వస్తోంది. మొదటి ఫ్లోర్‌లో 27 షాపుల నుంచి రూ.11,38,212 ఆదాయం సమకూరుతోంది.

● యూ-కాంప్లెక్స్‌లో 19షాపుల నుంచి రూ.7,85,988 వస్తోంది.

● మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 46షాపుల్లో 29 లీజుకి ఇచ్చారు వీటి ద్వారా రూ.89,74,408 ఆదాయం వస్తోంది.

● ఐడీఎస్ఎంటీ షాపుల నుంచి రూ.4,49,076, కెటిల్ షెడ్ దుకాణాల నుంచి రూ.22,356, పాత పంచాయతీ దుకాణాల నుంచి రూ.3,70,812 ఆదాయం సమకూరుతోంది.

● మిగిలిన 24 దుకాణాలను కూడా బాగు చేయిస్తే.. మునిసిపాలిటీకి మరింత ఆదాయం సమకూరుతుంది. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్ని దుకాణాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వాణిజ్య దుకాణాలు ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. త్వరలో దుకాణాలకు మరమ్మతులు చేస్తామని తెలిపారు. ప్రతిపాదనలు రూపొందించి కౌన్సిల్ ఆమోదంతో పనులు చేయిస్తామన్నారు. టెండర్లు పిలిచి దుకాణాలు వినియోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీవోఏలు

కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

● కలెక్టరేట్ వద్ద ధర్నాలో వీవోఏల డిమాండ్

అరసవల్లి, మార్చి 4: సమస్యల పరిష్కారం కోరుతూ వీవోఏలు సోమవారం కలెక్టరేట్ వద్ద ఏపీ వెలుగు ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ముందుగా వాంబేకాలనీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వీవోఏలకు మెడపై కత్తిలా ఉన్న కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'వీవోఏలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. అన్ని రకాల బకాయిలు చెల్లించాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. గ్రామ సమాఖ్యలో విలీనం ఆపాలి. సంఘాలను విడగొట్టడం, కలపడం లాంటి పనులు సెర్ప్ అధికారులే చేయడం సరికాదు. వీవోఏల ఉపాధికి నష్టం లేకుండా చూడాలి. ఉపాధి కోల్పోయిన వారందరికీ పరిహారం చెల్లించాలి. జెండర్, వయసు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలి. గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్ ఇవ్వాలి' అని వారు కోరారు. వీవోఏలకు టార్గెట్‌లు ఇవ్వడం, రికవరీ పేరుతో వేతనాల్లో కోత విధించడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఆర్.ప్రకాష్, వీవోఏల సంఘం నాయకులు డి.జోగారావు, ఎం.విమల, సరిత, రోహిణి, జి.ఎర్రయ్య, ఎస్.లక్ష్మి, వై.ద్రౌపది, ఉమ, బి.హేమ పాల్గొన్నారు.

ఆగని గంజాయి అక్రమ రవాణా

● ఇచ్ఛాపురంలో 35 కిలోల ప్యాకెట్లు లభ్యం

పలాస, మార్చి 4: నిరంతరం పోలీసులు, రైల్వే, ఎస్ఈబీ పోలీసులు.. రైళ్లు, రోడ్డు మార్గాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నా గంజాయి అక్రమ రవాణా ఆగడం లేదు. సోమవారం పలాస రైల్వే పోలీసులు ఇచ్ఛాపురం నుంచి పలాస వరకూ స్టేషన్లలో సోదాలు చేశారు. ఈ క్రమంలో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై 3 బ్యాగులు అనుమానాస్పదంగా కనిపించాయి. వాటికి సంబంధించిన వ్యక్తులు ఎవరూ లేకపోవడంతో బ్యాగులు తెరిచి చూడగా 35 కిలోల గంజాయి లభించినట్లు ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. ఆ గంజాయిని పలాస రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత వ్యక్తుల కోసం గాలించామన్నారు.

● గంజాయి రవాణాకు అడ్డాగా మారిన పలాసలో రైల్వే పోలీసులు నెల రోజుల నుంచీ తనిఖీలు చేస్తుండగా.. కిలోల కొద్ది గంజాయి ప్యాకెట్లు లభిస్తున్నాయి. దీంతో దాడులు ఉధృతం చేశారు. రైలుమార్గంలో మఫ్టీలో ప్రయాణికులతో కలసిపోయి అనుమానిత బ్యాగులపై నిఘా పెట్టారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రవాణాకు సిద్ధం చేయడానికి మూడు బ్యాగులు పెట్టి దూరంగా విషయాన్ని పరిశీలిస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల మాదిరి బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లు దాచిపెట్టినట్టు గుర్తించారు. దాడుల్లో కానిస్టేబుళ్లు పి.కోదండరావు, జి.నవీన్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది బిస్వాల్, జేకే మూర్తి పాల్గొన్నారు.



పలాస రైల్వే పోలీసులకు లభించిన గంజాయి ప్యాకెట్లు



వేసవిలోనూ మంచు దుప్పటి

ఇప్పుడు వేసవి కాలం. ఎండలు భగభగమంటున్నాయి. పది దాటితే చాలు.. సూర్యుడు భయపెట్టిస్తున్నాడు. అయితే జిల్లాలో ఉదయం పలుచోట్ల మంచుదుప్పటి కప్పేస్తోంది. శ్రీకాకుళంలో ఉదయం 7 గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తోంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకోవాల్సిన పరిస్థితి. మూడు, నాలుగు గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోతోంది. ఎండలకు జనం బెంబేలెత్తిపోతున్నారు.

- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- గ్రామానికి రెండువైపులా వాహనాలు పార్కింగ్
- ఎస్పీ జీఆర్ రాధిక

జలుమూరు: శివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. సోమవారం ఆమె శ్రీముఖలింగంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు అందించారు. ఈనెల 8 నుంచి 11 వరకు నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఉచిత, ప్రత్యేక దర్శనం కోసం వేర్వేరు క్యూలైన్లు, ఎండ తగలకుండా షామియానాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలకు గ్రామానికి రెండు వైపులా పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలకు వేర్వేరు పార్కింగ్ స్థలాలు కేటాయించా లన్నారు. చివరి రోజు స్వామివారి చక్రతీర్థ స్నానాలకు అదనపు బలగాలు తెప్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, సీఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ కె.మధుసూదనరావు, సర్పంచ్ సతీష్, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాదరావు, దేవాలయ అర్చకులు శేషాద్రి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శ్రీముఖలింగం పంచాయతీలో శివరాత్రి ఉత్స వాల నేపథ్యంలో పారిశుధ్య పనులను చేపట్టారు. అలాగే ఆహ్వాన పత్రాలను ప్రజాప్రతి నిధులు, అధికారులకు ఈవో ప్రభాకరరావు అందజేసి ఆహ్వానించారు.



మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

గేటు పడిందా అంతే!

- 108 సేవలకూ ఇబ్బందే.. ● నిత్యం ఇదే తంతు ● అవస్థలు పడుతున్న ప్రజలు
- ఇదీ తాళభద్ర, కాశీబుగ్గ, బాలిగాం రైల్వే గేట్ల వద్ద పరిస్థితి

(పలాస)

తాళభద్ర, కాశీబుగ్గ ఎల్‌సి గేట్లు దాటాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు.. గేటు పడిందంటే అత్యవసర సమయాల్లోనూ సుమారు 50 నిమషాల పాటు 108 వాహనాలు నిలిచిపోవాల్సిందే.. దీంతో సకాలంలో ఆసుపత్రులకు రోగులను చేర్చడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తాజా ఉదాహరణ సోమవారం ఉదయం వజ్రపుకొత్తూరు మండలం నుంచి 108 వాహనంలో క్షతగాత్రులను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాళభద్ర వద్ద రైల్వే గేటు పడింది. సుమారు అరగంట తరువాత గేటు తెరవ దంతో అప్పటికే 108కి ముందున్న వాహనాలను తప్పించుకుంటూ 108 వాహనం పలాస ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది. చిన్న ప్రమాదం కావడంతో గాయపడిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంది. అదే గర్భిణులు, గుండె జబ్బు ఉన్న వారిని తరలించి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించు కుంటేనే ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు గేట్లు వేశారంటూ కనీసం అర గంట నుంచి గంట వరకు తెరిచేందుకు అవకాశం లేదు. పలాస రైల్వే స్టేషన్ గ్రేడ్-1గా ఉండడంతో నిత్యం రైళ్ల రద్దీ ఉంటుంది. ప్రయాణికుల రైళ్లతో పాటు గూడ్స్‌లు కూడా అధికంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ సమయంలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బం దులు అన్నీ ఇన్నీ కావు. కాశీబుగ్గ ఎల్‌సి గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 15 ఏళ్ల కిందట పనులు ప్రారంభించినా నేటికీ అవి పూర్తి కాలేదు. తాళభద్ర వద్ద ఇటీవల ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ప్రతిపాదనలు పెట్టినా అవి పూర్తయ్యేందుకు కనీసం పదేళ్లయినా సమయం పట్టే అవ కాశం ఉంది. నిత్యం రైల్వే గేట్ల వల్ల ప్రజలు నరకాన్ని అనుభవిస్తున్నారు. రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తాళభద్ర రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన 108 అంబులెన్స్ (వృత్తంలో)



బాలిగాం గేటు వద్ద అండర్ పాసేజ్ నిర్మించాల్సిన ప్రాంతం

బాలిగాం గేటు వద్ద..

హరిపురం: మందస మండలం హరిపురం-మందస రోడ్‌లో బాలిగాం వద్ద రైల్వేగేటుతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఒకసారి గేటు వేసి అరగంట దాటినా తీయని పరిస్థితి నెలకొంది. సమీపంలోని మందస రోడ్ రైల్వేస్టేషన్‌లో రైళ్లు నిలిచి తిరిగి బయలుదేరే వరకు గేటు తీయడం లేదు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి బాలిగాం గేటువద్ద అండర్ పాసేజ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ-జనసేన కూటమితో రాష్ట్రాభివృద్ధి

టీడీపీ-జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పలువురు నేతలు అన్నారు. గ్రామాల్లో బాబు ష్యూరిటీ, సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలు అవగాహన కలిగించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.

తల్లికి వందనంతో ప్రతి విద్యార్థికీ మేలు

నరసన్నపేట: టీడీపీ-జనసేన ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికీ మేలు చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలో 15వ వార్డు పరిధి చిత్రివీధి, పప్పులవీధి తదతర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, నేతింటి విశ్వేశ్వరరావు, చంద్రరావు, బోయన సతీష్, బెవర రాము, కింజరాపు రామా రావు, కూన రమేష్, తాళాభక్తుల గోవిందరావు, బెవర శివ,పల్లి సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే తీర గ్రామాల అభివృద్ధి

సంతబొమ్మాళి: టీడీపీ హయాంలోనే తీరప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న అన్నారు. సోమవారం మలగాం పంచాయతీ చెరువు గట్టుపేటలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాలు టీడీపీ ప్రభుత్వంలోనే ఏర్పాటయ్యాయన్నారు. కార్యక్రమంలో మలగాం మాజీ సర్పంచ్‌లు బుచ్చ మురళీకృష్ణ, రట్టి పెరుమాళ్ళు, ఉప సర్పంచ్ కంది లచ్చయ్య, వజ్జ ప్రభాకర్, సూరాడ ధనరాజ్, సువ్వారి ప్రసాద్, కూశెట్టి కాంతారావు తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు:** టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. చీడిపూడి, అక్కివలస, లక్ష్మీపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పొదిలాపు వేణుగోపాలరావు, హనుమంతు వెంకటరమణమూర్తి, కింజరాపు రామారావు తదితరులు పాల్గొన్నారు. ● **టెక్కలి:** టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్య క్షుడు బగాది శేషగిరి అన్నారు. సోమవారం మొఖలింగాపురం పంచాయతీ బెండకాయలపేట, మొఖలింగాపురం గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలని, తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు జన్ని చిన్నారావు, ఆదినారాయణ, లచ్చుమయ్య తమకు పింఛన్లు ఇంతవరకు ఇవ్వలేదని వారి దృష్టికి తీసుకువెళ్లగా అధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. ● **జి.సిగడాం:** టీడీపీ అధినేత చంద్రబాబు తోనే భవిష్యత్‌కు గ్యారెంటీ అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జిలు కూనుబిల్లి కూర్మారావు, టంకాల మహేశ్వరరావు అన్నారు. సోమవారం అబోతులపేట, నాగులవలస, పెంట, జాడ, జగన్నా థవలస, దేవరవలస, మద్రివలస, సీతంపేట, నడిమివలస, బాతువ తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చిత్తిరి అసిరినాయుడు, పైల రామకృష్ణంనాయుడు, మహా దాశ్యం చిన్నారావు, జక్కంపూడి దాసు, గోక మహేష్, బాలి తమ్మినాయుడు, కూనుబిల్లి శ్రీనివాసరావు, కె.సంతోష్‌కుమార్, మీసాల అశోక్‌కుమార్, సిరిపురపు ఉపేంద్ర, నేదూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: తల్లికి వందనం పథకంపై వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



సంతబొమ్మాళి: చెరువుగట్టుపేటలో పథకాలపై అవగాహన కలిగిస్తున్న టీడీపీ నాయకులు



టెక్కలి: మొఖలింగాపురంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నేతలు



జలుమూరు: లక్ష్మీపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహిస్తున్న కత్తిరి వెంకటరమణ, తదితరులు



జి.సిగడాం: 'సూపర్ సిక్స్'పై ప్రచారం చేస్తున్న నాయకులు

భారీ వాహనాల వల్ల రోడ్లు పాడవుతున్నాయి

- ఆర్అండ్‌బీ ఈఈ సత్యనారాయణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

టెక్కలి: మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో హెవీలోడ్ వాహనాల రాకపోకల వల్ల తరచూ రోడ్లు పాడవుతున్నాయని ఆర్అండ్‌బీ ఈఈ కె.సత్యనారాయణ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'రోడ్ల నిర్వహణ ఏదీ?' శీర్షికతో వచ్చిన కథనా నికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టేందుకు త్వరలో తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ఆర్ అండ్‌బీ డివిజన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో కల్వర్టుపై పడిన రంధ్రం పూడ్చడంలోనూ ఆ శాఖ విఫలమైందని టీడీపీ, కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు. రోడ్ల నిర్వహణ ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉన్నా ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్ల జాప్యం జరుగుతోందని విమర్శించారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలమట వెంకటరమణ

కొత్తూరు: మెట్టూరు గ్రామ పంచాయతీ మెయిన్ రోడ్డులో టీడీపీ నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, మెట్టూరు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు కదిలిన టీడీపీ కేడర్



బస్సులో కేడర్‌తో కలిసి వెళుతున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: టీడీపీ ఆధ్వర్యంలో మంగళగిరిలో మంగళవారం నిర్వహించనున్న జయహో బీసీ సభకు నరసన్నపేట నియో జకవర్గం నుంచి టీడీపీ కేడర్ సోమవారం బస్సు, 25 కార్లలో బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జెండా ఊపి కేడర్‌తో కలిసి బస్సులో బయలుదేరి వెళ్లారు.

కలెక్టర్ ఆదేశాలతో స్థల పరిశీలన

నరసన్నపేట: మేమంతా బతికేందుకు ప్రభుత్వ భూములను ఇచ్చిందని, ఈ భూముల్లో రోడ్డు వేస్తే తీవ్రంగా నష్టపోతామని జమ్ము గ్రామానికి చెందిన దళిత రైతులు గత నెల 23న స్పందన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో సోమవారం రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములను పరిశీలించారు. 326ఏ హైవే నుంచి పోన్నానపేట వరకు రోడ్డు వేసేందుకు పనులు చేపట్టడంతో రైతులు ఫిర్యాదు చేశారు. వీఆర్వో పీవీ రమణ, సర్వేయర్ శరత్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ప్రాథమికంగా రోడ్డు అసైన్డ్ భూముల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. నివేదికను తహసీల్దార్ ద్వారా కలెక్టర్‌కు పంపనున్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి గ్రామదేవత ఆలయ పునః ప్రారంభోత్సవం

నందిగాం: మండల కేంద్రంలోకొలువై ఉన్న పాతపట్నం అమ్మతల్లి (నీలమణిదుర్గ) గ్రామదేవత ఆలయ పునః ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్స వాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉత్స వ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, యాగశాల సంస్కారం, కలశ స్థాప న, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు, సాయంత్రం అమ్మవారి విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అలాగే బుధ, గురువారాల్లో ప్రత్యేక పూజలు, హోమా లు, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా హోమగుండం, యాగశాలను ఏర్పాటుచేశారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

జిల్లాలో బీసీ సామాజిక సమావేశాలు

టెక్కలి: జిల్లాలో బీసీ సామాజిక సమావేశాలు నిర్వహించనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా మన్‌కీ బాత్ ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్ వంజంగి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీ సమాజాభివృద్ధికి అనేక నిర్ణయాలు తీసుకున్నారని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిన మోదీ ప్రభుత్వం జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించిందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన





శ్రీకాకుళం, జలుమూరు ఉపాధి కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు

నరసన్నపేట/జలుమూరు/కలెక్టరేట్/లావేరు/పొందూరు: ఉపాధి హామీ పథ కంలో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ కన్సల్టెన్స్ నిరసన తెలిపారు. సోమవారం నరసన్నపేట, జలుమూరు, శ్రీకాకుళం, లావేరు, పొందూరు కార్యాలయాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వేతనాలు పెంచాలని, గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఐదేళ్లలో కనీస స్థాయిలో వేతనాలను పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు క్రమబద్ధీకరణ చేయాలని, ఎఫ్‌టీఈ వర్తింపు తదితర సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అప్పలరాజు, ఆర్‌వీ రమణ, రవి, గౌతమ్, హైమావతి, కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ కన్సల్టెన్స్ తదితరులు పాల్గొన్నారు.





నరసన్నపేట, పొందూరుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ కన్సల్టెన్స్‌లు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

టెక్కలి: రావివలస పంచాయతీ చిన్ననారాయణపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు ఎ.శ్రీరాములు, ఈఎన్‌టీ వైద్యుడు కణితి కేశవరావు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీవో కె.గొల్ల, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని చెక్ పోస్టు వద్ద ఎస్ఐ మహ్మద్ యాశిన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఒడిశాకు చెందిన పర్లాకిమిడి, ఇటు ఆంధ్రాలో ఒకే సమయంలో వాహనాలను సరిహద్దుల పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో గంజాయి అక్రమ తరలింపు కేసులు అధికమవుతుండడంతో అప్రమత్తమై తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డిప్యూటీ డీఈవోగా రామకృష్ణ



టెక్కలి: టెక్కలి డివిజన్ డిప్యూటీ డీఈవోగా నక్క రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గార ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు పదోన్నతిపై ఇక్కడ నియమించారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది బెనర్జీ, కుప్పిలి నగేష్, ప్రకాష్ కలిసి అభినందించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా ఉన్న ఆర్.విజయకుమారి శ్రీకాకుళం డిప్యూటీ డీఈవోగా తన యథాస్థానానికి వెళ్లారు.

దళిత, గిరిజన ఆదివాసీలకు రక్షణ కరువు

నందిగాం: రాష్ట్రంలో సీఎం జగన్‌రెడ్డి పాలనలో దళిత, గిరిజన ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల మాచర్ల నియోజకవర్గంలోని గిరిజన మహిళ మంచి నీరు అడిగితే ట్రాక్టర్‌తో గుద్ది చంపేశారని, అలాగే తిరు పతిలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ కొండప్ప లంచాలు రూపంలో కలెక్షన్ చేసి ఇవ్వనందుకు దళిత కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను దుర్భాషలాడి భౌతికదాడికి పాల్పడ్డారన్నారు. ఘటనలతో దళిత, గిరిజనులకు రక్షణ లేదని చెప్పకతప్పదన్నారు. ఈ ఘటనల్లో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

8న జిల్లాస్థాయి క్రికెట్ మ్యాచ్

నరసన్నపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 8న నరసన్నపేట జూనియర్ కళా శాల మైదానంలో జిల్లాస్థాయి డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు రాక్‌స్టార్ క్రికెట్ అసోషియేషన్ సభ్యులు డేవిడ్, పి.రాము, బి.రాజశేఖర్ తెలిపారు. స్థానిక క్రికెట్ అకాడమీ వద్ద విలేక రులతో మాట్లాడుతూ.. ఆరు ఓవర్లు మ్యాచ్ ఉంటుందని, మొదటిగా పేర్లు నమోదు చేసుకున్న 32 జట్లకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల జట్లు పేర్లను 91103 69992 నెంబరులో నమోదు చేసుకోవాలని సూచించారు.

తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శిగా పద్మావతి



టెక్కలి: తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శిగా నందిగాం మండ లానికి చెందిన మెట్ట పద్మావతిని నియ మిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు ఆమె టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్, పార్టీ అధ్య క్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన కార్యక్రమాల విజయవంతానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి పాటుపడతానని ఆమె పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



పలాసరూరల్: రైతులు పండించిన పంటను మిల్లులకు అందజేస్తే ఇంత వరకు నగదు జమ కాలేదని, తగు చర్యలు తీసుకోవాలని రైతుసంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీవో భరత్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జీడిపంటపై మంచు పడడంతో నాశనమైందని, బీమాను అమలు చేసి రైతులకు ఆదుకోవాలని, తితలీ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, ఉపాధి హామీలో రైతులను అనుసంధానం చేసి వలసలను అరికట్టాలని, జీడికి మద్దతు ధర రూ.16 వేలు అందజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతుసంఘ నాయకులు దాసరి శ్రీరాములు, మామిడి మాధవరావు, తామాడ త్రిలోచనరావు, మద్దిల ధర్మారావు, పి.దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ హామీ ఇచ్చే పార్టీకే మద్దతు

నందిగాం: ఓపీఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయులు మద్దతు ఇస్తారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు అన్నారు. సోమవారం నంది గాం ఎమ్మార్సీ, కాపు తెంబూరు ఉన్నతపాఠశాలల ఆవరణలో ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకావిష్కరణ చేశా రు. మండల కాంప్లెక్స్ పరిధిలోని గోడలపై 'రానున్న ఎన్నికల్లో పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే పార్టీ లకే మద్దతు' అంటూ గోడలపై బోర్డులు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంఈవో జె.చిన్నారావు, హెచ్ఎం టి.అప్పలస్వామి, యూటీఎఫ్ సంఘ ప్రతినిధులు కె.కుమారస్వామి, వై.గణపతి, కె.సురేష్‌కుమార్, ఎన్.శివప్రసాద్ తదితరులున్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు



ప్రశ్న పత్రాలను భద్రపరుస్తున్న దృశ్యం

నరసన్నపేట: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలు మొదటి సెట్ సోమవారం నరసన్నపేట పోలీసు స్టేషన్‌లో చీఫ్ సూపరింటెంట్లు, డీవోలు భద్రపరిచారు. మండలంలో 1,253 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈవో ఉప్పాడ శాంతారావు తెలిపారు.

తాగు, సాగునీరు టీడీపీతోనే సాధ్యం

- ట్యాంక్ నిర్మాణంలో నాణ్యతా లోపాలు
- ఉద్దానం ప్రాజెక్టులోని అవినీతిని వెలికితీస్తాం
- ఎంపీ రామ్మోహన్ నాయుడు


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్ తదితరులు

ఇచ్ఛాపురం: జిల్లా ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు, సాగునీరు అందించడం టీడీపీకే సాధ్యమని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. పాతళసిద్ధేశ్వర ఆలయం వద్ద జగనన్న కాలనీ సమీపంలో నిర్మించిన ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ లీకేజీను ఎంపీ, ఎమ్మెల్యే బెందాళం, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేసేందుకు ఇచ్ఛాపురం మున్సిపాల్టీ జగనన్న కాలనీ సమీపంలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.700కోట్లు ఖర్చు చేసి ఎనిమిది మండలాలక నీరు అందిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రారంభించారు. ఎంతో ఆర్భాటంగా ఓపెన్ చేసినా.. ఇచ్ఛాపురంలో నిర్మించిన ట్యాంక్ పరిశీలిస్తే పనుల నాణ్యతపై ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. కొండపైన నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ఓవర్ ఫ్లో కావడంతో కింద ప్రాంతంలో నిర్మించిన ఇళ్లలోకి నీరు వెళ్తుంది. దీనివల్ల ప్రజల ఇబ్బంది పడుతున్నా రు. పనుల్లో నాణ్యత లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొం దని, బాధ్య టతలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్దానం ప్రాంత ప్రజల నీటి సమస్య తీర్చేశామని చెప్పిన అధికార పార్టీ నాయకులు ఉద్దానం ప్రాంతంలో గల 118 గ్రామాల్లో సగం గ్రామాలకు కూడా సక్రమంగా తాగు నీరు అందని పరిస్థితి ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేప ట్టిన పనులన్నీ నాసిరకమేనని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు బహిర్గతం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికిజాని, కౌన్సిలర్లు పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్, సహదేవ్‌రెడ్డి, దక్కత ఢిల్లీరావు, లీలారాణి, రెయ్యి జానికిరావు, కొరాయి ధర్మరాజు, ఊనా సంతోష్ తదితరులు పాల్గొన్నారు


కంచిలి: ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్

కంచిలి: భావి తరాల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రిగా రావాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గొల్లకంచిలి, ఒరియా నారాయణపురం, అమ్మవారిపుట్టుగ, శ్రీరాంపురం, కాకర్లపుట్టుగ, శమళ్లపుట్టుగ గ్రామాల్లో సోమవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లకంచిలి, కాకర్లపుట్టుగ గ్రామాల్లో పలువురు టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన డొక్కరి చిన బాలయ్య, సంతోష్, రామకృష్ణ, ఉమాపతి, మన్మధరావు, కేశవరావు, కాకర్ల ఫణీంద్ర, ప్రశాంత్, మోహనరావు, దేవాంగ్, అభి, వినీత్ తదితరులు పార్టీలో చేరారు. వారికి ఎంపీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం గ్రామ దేవతల ఆలయాలను సందర్శించి, పూజలు జరిపారు. నాయకులు మాదిన రామారావు, బంగారు కురయ్య, తమరాల శోభన్ పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

కవిటి: మాణిక్యపురం, కవిటి, గొండ్యాలపుట్టుగ గ్రామాల నుంచి దాదాపు 180 కుటుంబాలకు చెందిన వారు ఎంపీ రామ్మోహన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం మండలంలో పర్యటించిన ఎంపీ రామ్మోహన్‌తోపాటు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లకు మాణిక్యపురం గ్రామం నుంచి కవిటి వరకు ప్రజలు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరాచక పాలనను అంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం, గూండాయిజంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. టీడీపీ హయాంలో బెంతుఒరియాలకు న్యాయం చేశామన్నారు. ఎమ్మెల్యే బి.అశోక్ మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో ప్రజలకు మేలు చేసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలని యత్నిస్తే జగన్‌రెడ్డి అప్పుల పాలు చేశారని విమర్శించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొత్త ఓటర్ల చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు

ఆమదాలవలస: రానున్న ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్ల చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు అన్నారు. సోమవారం ఆమదాలవలస పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆమదాలవలస నియోజక వర్గంలో ఏడుగురు సభ్యులతో ఏపీ వారియర్స్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. బూర్జ మండలం నుంచి రామకృష్ణనాయుడు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, సరుబుజ్జిలి మండల తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు, పొందూరు మండలం నుంచి బలగ విజయశంకర్ భాస్కరరావు, చింతాడ వాసుదేవరావు సభ్యులుగా ఉన్నారన్నారు.

బీసీలను ఆదుకోండి

ఇచ్ఛాపురం: బీసీ కులానికి చెందిన రెడ్డిక కులస్థులను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిని రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, స్టేట్ బీసీ ఫెడరేషన్ చైర్మన్ కొల్లు రవీంద్ర కోరారు. సోమవారం మంగళగిరిలో గల పార్టీ కార్యాలయంలో బీసీ కులాలతో జరిగిన సమావేశంలో పలు సమస్యలు వివరించారు. మంగళవారం మంగళగిరి నాగార్జున వర్సిటీ ప్రాంగణలో జరగనున్న జైహో బీసీ కార్యక్రమంలో బీసీ మేనిఫెస్టోలో పారిశ్రామిక రుణాలు, డైరీ, పౌల్ట్రీ రుణాలు, చిరు వ్యాపారులకు రుణాలు, కమ్యూనిటీ హౌసింగ్ కాలనీలు, సామాజిక భవనాల ఏర్పాటు, ఉచితంగా 200 యూనిట్లు కరెంటు తదతర అంశాలు పొందుపరచాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో కొత్త బ్యాచ్

అరసవల్లి: ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీఎస్‌ఆర్టీసీలో మాత్రమే ఈ శిక్షణ అందుబాటులో ఉందన్నారు. ఈ శిక్షణలో డ్రైవింగ్‌లో మెలకువలతో పాటు, యోగా, వ్యక్తిత్వ వికాసంలపై కూడా అవగాహన కల్పించడంతో డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫీజు, ఇతర వివరాలకు 9963091999, 7382923293 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలని కోరారు.

టీడీపీ కృషి వల్లే పాసింజర్ రైలు హాల్ట్

ఇచ్ఛాపురం: తెలుగుదేశం పార్టీ తరుపున పలుమార్లు రైల్వే అధికారులను కలిసి సమస్యలు తెలియజేసి వినతి పత్రాలు ఇవ్వడం వల్లే ఇచ్ఛాపురం ప్రజల చిరకాల కళ నెరవేరిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సోమవారం ఇచ్ఛాపురం వచ్చిన ఎంపీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైలు హాల్టింగ్‌కు టీడీపీ కృషి చేస్తే వైసీపీ నాయకులు హాల్టింగ్‌కు కారణం మీమేనని చెప్పుకుంటూ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమస్యలపై పోరాడలేని వైసీపీ నాయకులు గొప్పలు చెప్పుకవడంలో ముందుంటారని విమర్శించారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ తదితరులు ఉన్నారు.

యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఇచ్ఛాపురం: భారత ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన మూడు యాప్‌లను ప్రతీ ఓటరు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీఎం సనపల ప్రసాద్ అన్నారు. సోమవారం మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన యాప్‌లపై అవగాహన కల్పించారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

ఇచ్ఛాపురం: పురపాలక సంఘ పరిధి 7వ వార్డులో 40మంది లబ్ధిదారులకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి 40మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించి డ్యాక్యుమెంట్లను అందజేశారు. మంగళవారం వార్డు పరిధిలో గల సచివాలయంలో లబ్ధిదారులందరిని పిలిపించి పత్రాలు అందించారు.

పంట మార్పిడి పాటించాలి

రణస్థలం: పంట మార్పిడి విధానంపై రైతులు దృష్టిసారించాలని డీడీఏ కె.త్రినాథస్వామి సూచించారు. సోమవారం ఎర్రవరం రైతు భరోసా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొక్క జొన్న పంటలో యూరియాతో పాటు పోటాష్, భాస్వరం ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవి కాలంలో నువ్వుల సాగు మంచి లాభదాయకమని ఏడీ శ్రీనివాసరావు వివరించారు. శాస్త్రవేత్త కె.భాగ్యలక్ష్మి, ఏవో విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

అంతిమ రథం ఏర్పాటుకు హామీ

సోంపేట: పట్టణంలోని శ్రీశయన సంఘానికి అంతిమ రథం అందించేందుకు మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ హామీ ఇచ్చారు. ఆయన స్వగృహంలో శ్రీశయన సంఘ ప్రతినిధులు కలుసుకొని సోమవారం వినతి పత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన శివాజీ తన తండ్రి గౌతు లచ్చన్న జ్ఞాపకార్థం అంతిమ రథం ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు. సంఘ అధ్యక్షుడు రెల్ల నారాయణ, ప్రతినిధులు బీన ఆనంద్, రెల్ల జయరాం, పొందూరు దామోదరం, గేదెల భీమారావు ఉన్నారు.

నేతాలమ్మకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం: నేతాలమ్మ అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్ర రెండో రోజులు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. మూడు రోజలపాటు ప్రత్యేక పూజలు, వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

టెట్‌కు 370 మంది హాజరు

ఎచ్చెర్ల: మండలంలో రెండు కేంద్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)కు సోమవారం 370 మంది హాజరయ్యారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిప్టుల్లో కలిపి 200కు 184 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 186 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 7వ తేదీ వరకు జరగనున్నాయి.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లావేరు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ లుట్టు అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగునున్నట్లు ఎంపీడీవో కొండలరావు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీతో పాటు మండలంలోని అందరు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు, అన్నీ శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

లావేరు: చిరుదాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని బెజ్జిపురం యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. తాళ్లవలసలో యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో ఆహారం తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. నాబార్డు సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 20 రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రం ఉంటుందని చెప్పారు. అనంతరం ఆశక్తి గల మహిళలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గోగు కిరణాల సీఈవో శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు గంట్యాడ అప్పలనాయుడు, కేవీ ధర్మారావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు బలోపేతం కావాలి



ఇచ్ఛాపురం: మండల స్థాయిలో గ్రామ సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని లీగల్ కో ఆర్డినేటర్ మోహిని అన్నారు. సోమవారం మండల సమైక్య కార్యాల యంలో 2023-34 ఆర్థిక సంవత్సరంలో స్వయంశక్తి సంఘాలకు అందించిన రుణాలు డాక్యుమెంట్లు పరిశీలించారు. ప్రభుత్వం అందించిన రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.ప్రసాద్, మండల సమైక్య అకౌంటెంట్, సీసీలు, 30మంది గ్రామ సంఘ నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

పొందూరు: లోలుగు గ్రామానికి చెందిన రాంబోతు నాగరాజుపై జరిగిన హత్యాయత్నం కేసులో అతడి భార్య ఎం.లక్ష్మిపై నేరం రుజువు కావడంతో సోమవారం రాజాం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎం.బాబు.. ముద్దాయికి రూ.1000 జరిమానాతోపాటు మూడేళ్లు జైలుశిక్ష విధించారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. 2019 మే 30న నాగరాజుపై లక్ష్మి హత్యాయత్నం చేసినట్టు అతడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ దేవానంద్ కేసు నమోదు చేశారు. అనంతరం విధుల్లో చేరిన ఎస్ఐ మహ్మద్ యాసిన్ ఆలీ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేశారు. దీనిపై ఫిర్యాదుదారుల తరుపున ఏపీపీ కె.ఉషాకిరణ్ వాదించారు. వాదనలో నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారైనట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

టీడీపీ నేత నాగేంద్ర మృతి


నాగేంద్ర (ఫైల్)

ఎచ్చెర్ల: కొంగరాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత గోపిన నాగేంద్ర కుమార్ బాబు మృతిచెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. టీడీపీ ఆవిర్భావం నుంచి గోపిన కుటుంబం పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. కుమార్ బాబు తండ్రి రాంబాబు కొంగరాం గ్రామానికి సర్పంచ్‌గా, నీటి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. తెలుగు యువత అధ్యక్షుడిగా, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసిన కుమార్‌బాబుకు భార్య సుధారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజకీయాలకతీతంగా అందరితో కలుపుగోలు ఉండే కుమార్‌బాబు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మద్యం సీసాల స్వాధీనం

పొందూరు: బాణాం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 300 మద్యం సీసాలను ఎన్‌ఫోర్సుమెంటుబ్యూరో అధికారులు పట్టుకున్నారు. మద్యం సీసాలు తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఈబీ ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో దాడిచేసి బాణాం సమీపంలో ద్విచక్రవాహనంపై 300 మద్యం సీసాలను తరలిస్తున్న పెద్దింటి ముకుందరావును పట్టుకుని మద్యం సీసాలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక నిఘా పెట్టి భారీగా మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్పీ స్పందనకు 42 వినతులు

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 42 వినతులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలపై ఐదు, కుటుంబ కలహాలపై మూడు, మోసపూరితమైనవి ఆరు, సివిల్ తగాదాలపై ఎనిమిది, మిస్సింగ్‌కి సంబంధించి నాలుగు, పాత తగాదాలపై ఐదు, ఇతర తగాదాలపై 11 వినతులు ఉన్నాయి. ఈ వినతులను ఎస్పీ జీఆర్ రాధిక స్వీకరించి బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, వినతులపై దర్యాప్తు చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన రిటైర్డు హోంగార్డు ఆరిక నూకయ్యను ఎస్పీ జీఆర్ రాధిక ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ గోపీనాథ్, ఆర్ఐ డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

అరసవల్లి: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అన్ని పార్టీల నాయకులు నిర్లక్ష్యం వహించారని, ఇంకెన్నాళ్లు ఈ నిర్లక్ష్యం కొనసాగుతుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర ప్రశ్నించారు. స్థానిక క్రాంతి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందడం లేదని, ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించడంలో పూర్తిగా విఫలమయ్యా యని విమర్శించారు. రాష్ట్రంలోని జగన్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు విడుదల చేయమని అడిగితే విశాఖలో తమ నివాసం కోసం వందల కోట్లు ఖర్చు చేశారన్నారు. జిల్లాలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని, నూతన పరిశ్రమలను నెలకొల్పాలని, గిరిజనులకు స్వయం ఉపాధి కల్పించాలని, మత్స్యకారులకు ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. శ్రీకాకుళం లో ఈ నెల 12న జరిగే యంగ్ ఇండియా సదస్సులో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు గోపి నాయుడు, నాయకులు రాము, బంగారు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సుద్దాల అశోక్‌తేజ

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు వారికి అందజేశారు. ఇప్పిలి రంజిత్‌శర్మ, సాంబమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో..

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుడిని సినీగేయ రచయిత సుద్దాల అశోకతేజ కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, సీతారామ నర్సింహాచార్యులు, నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.


గార: అశోక్ తేజను ఆశీర్వదిస్తున్న అర్చకులు

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్: స్పందనలో వచ్చే అర్జీలకు నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 235 అర్జీలను స్వీకరించారు. కార్య క్రమంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహనరావు, దొరబాబు, కొవ్వాడ ఉప కలెక్టర్ ఎస్‌వీ లక్ష్మణ మూర్తి, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటరామన్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఇరిగేషన్ ఎస్ఈ డోల తిరుమలరావు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఐటీడీఏ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంచార పశువైద్యాన్ని వినియోగించుకోండి


చికిత్స అందిస్తున్న పశువైద్యుడు

గార: సంచార పశువైద్యశాల ద్వారా అందిస్తున్న సేవలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఉదయం అంబటి వానిపేటలో సంచార పశువైద్యశాల ద్వారా అందిస్తున్న సేవలు పరిశీలించి రైతులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సంచార పశువైద్యశాల ద్వారా సేవలు కోసం 1962 నెంబరును వాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, పశువైద్యులు మన్మధరావు, సాయిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై తమ్మినేని మాట్లాడడం హాస్యాస్పదం

ఆమదాలవలస: వైసీపీ నాయకులు చేస్తున్న భూ దందా, దోపిడీల్లో మొదటి స్థానంలో ఉన్న స్పీకర్ తమ్మినేని సీతారాం.. టీడీపీ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు నూకరాజు, బోర గోవిందరావు, శివ్వాల సూర్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ భూ ఆక్రమణలకు ప్రయత్నించారంటూ తమ్మినేని తప్పుడు ప్రచారాలు చేయడాన్ని వారు ఖండించారు. పబ్లిక్, ప్రైవేటు పార్టనర్స్‌గా ప్రభుత్వ భూములను లీజు పద్ధతిలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రవికుమార్ వెన్నెలవలస వద్ద ఉన్న ప్రభుత్వ భూములకు దరఖాస్తు చేశారన్నారు. ఏ రాజకీయ పార్టీకైనా నియోజకవర్గ కేంద్రంలో అనుకూలంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పార్టీ కార్యాలయానికి కేటాయించాలంటూ దరఖాస్తు చేసుకొనే అవకాశం ప్రతి పార్టీకి ఉంటుందన్నారు. దీనిలో భాగంగానే ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రవికుమార్ పార్టీ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని దరఖాస్తు చేస్తే ఈ రెండు అర్జీలను స్పీకర్ ఇప్పుడు రవికుమార్ భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నాయన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: మెట్టక్కివలస, హడ్కో కాలనీలో సోమవారం తెల్లవారు జామున సీఐ జి.దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని ఆరు ద్విచ క్ర వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది మద్యం సీసాలను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు అన్ని రకాల పత్రాలు సరిచూసుకొని రోడ్డుపైకి రావాలన్నారు. ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎస్ఐలు కె.వెంకటేష్, ఐ.నాగరాజు, బి.నిహార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య సైకిల్ యాత్రికులకు ఘనస్వాగతం


ఇచ్ఛాపురం చేరుకున్న సైకిల్ యాత్రికులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, కాకినాడ, భీమవరం, రావులపాలెం ప్రాంతాలకు చెందిన నలుగురు యూటూబర్స్ వెంకటేష్, శివ, సతీష్, చైతన్య.. కాకినాడ నుంచి అయోధ్యకు వెళ్లేందుకు సైకిల్ యాత్ర చేపట్టారు. సోమవారం వారు ఇచ్ఛాపురం చేరుకున్న సందర్భంగా పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వారు పూజలు చేసి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీరామునిపై భక్తితో సైకిళ్లపై అయోధ్య చేరుకోవాలనే ఈ యాత్ర చేపట్టామన్నారు. ఆరు రోజుల కిందట కాకినా డలో ప్రారంభమైన ఈ యాత్రకు భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. సుమారు 1700 కిలోమీటర్లు ప్రయాణం చేసి మార్చి 20వ తేదీకి అయోధ్యకు చేరుకొనే అవకాశం ఉందన్నారు. వీరికి స్థానికులు పి.చిరంజీవి, దివాకర్ తదితరులు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

పోస్టల్ బ్యాలెట్స్ కీలకం

కలెక్టరేట్: ప్రస్తుత పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్స్ ఎంతో కీలకమని డీసీవో బాలాజీ నాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ఎన్నికల శిక్షణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఫారం-12, ఫారం-13 ఏబీసీడీలు నింపే ప్రక్రియపై వివరించారు. డ్వామా పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ల తయారీ, స్వీకరణలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో డీటీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన


శిరీషను అభినందిస్తున్న కలెక్టర్, జేసీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: ఇటీవల రాంచీలో జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి మహిళా విభాగం ఉషు క్రీడా పోటీల్లో ముద్దాడ శిరీష కాంస్యపతకం సాధించింది. ఈ మేరకు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతి అభినందించారు.

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిని కలిసిన వీసీ



ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని సోమవారం అమరావతి లోని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కె.శ్యామలరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీకి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 కోట్లు నిధులు త్వరితగతిన వర్సిటీ ఖాతాలో జమయ్యేలా చూడాలని ముఖ్యకార్యదర్శిని కోరినట్టు తెలిపారు. వర్సిటీ పాలకమండలి నిర్వహణకు తేదీని నిర్ణయించాలని కోరామన్నారు. కాగా, అమరావతిలో జరిగిన రాష్ట్ర ఉన్నత విద్య ప్రణాళిక మండలి (ఏపీహెచ్ఐపీబీ) సమావేశంలో వీసీ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు తప్పని అవస్థలు


కళాశాల బయట వేచిఉన్న విద్యార్థుల కుటుంబ సభ్యులు

గుజరాతీపేట: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలో కొన్ని జూనియర్ కళాశాలు తప్పించి, నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో గల కళాశాలకు విద్యార్థులను కేటాయించడంతో అవస్థలు పడుతున్నారు. ఆయా కళాశాలలకు ప్రతి రోజూ జిల్లా కేంద్రం నుంచి వెయ్యి మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా బాలికల తల్లిదండ్రులు వారి పిల్లలను ఒంటరిగా వదలలేక తోడుగా వెళ్లాల్సి వస్తోంది. కొంతమంది తల్లిదండ్రులైతే అక్కడే కళాశాల రోడ్డుపైన ఎండలో ఉంటూ ఇబ్బందిపడుతున్నారు. నగరంలో ఉన్న చాలా జూనియర్ కళాశాలలను తప్పించి దూరంగా ఉన్న కళాశాలను సంబంధిత అధికారులు ఎంపిక చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ఠ భద్రత


పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు.. ఫ్లాగ్ మార్చ్‌లో కేంద్ర బలగాలు

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల్లో ప్రతీ పౌరుడు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా, సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలని కేంద్ర బలగాలను ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ జిల్లాకు కేంద్ర బలగాలను కేటాయించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు రెండు కేంద్ర పోలీసు దళాలను కేటాయించడంతో వారు సోమవారం జిల్లాకు చేరుకుని ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఎస్పీ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా పోలీసులతో సమన్వయం చేసుకుని ఎని న్నకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పని చేయాలన్నారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీలు వై.శృతి, ఎల్.శేషాద్రినాయుడు, సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రతీ పోలీసు హెల్మెట్ ధరించాలి

శ్రీకాకుళం క్రైం: కంటైనర్‌లో గంజాయి రవాణాను అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ, కానిస్టేబుల్స్ కంటైనర్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో కంటైనర్ నడిపే వ్యక్తి పోలీసులను గుద్దేసి పరారైన ఘటనలో హెల్మెట్ ధరించడం వల్లే పోలీసులు ప్రాణాలతో బయ టపడ్డారు. ఈ క్రమంలో ప్రతీ పోలీసు భద్రత లక్ష్యంగా పోలీసు ఉన్నతాధికారులు జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న ప్రతీ ఒక్క పోలీసు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి ఆదేశాలు అందిస్తున్నట్టు తెలుస్తుంది.

ఆరుబయటే విద్యార్థుల సైకిళ్లు


గార జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న సైకిళ్లు

గార: మండలంలోని పలు పాఠశాలల్లో షెడ్లు లేకపోవడంతో విద్యార్థులు తమ సైకిళ్లను ఆరుబయటే ఉంచుకుంటున్నాయరు. ఇందుకు నిదర్శనం గార జడ్పీ హైస్కూల్‌లోని పరిస్థితే నిదర్శనం. దాదాపు ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఈ పాఠశాలకు సైకిళ్లపై వచ్చి వెళ్తున్నారు. ఈ పాఠశాలలో షెడ్ లేకపోవడంతో వందలాది సైకిళ్లు ఆరుబయటే ఉండిపోతున్నాయి. దీంతో ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ సైకిళ్లు పాడైపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైకిళ్లు పెట్టుకునేందుకు షెడ్డు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.